సాక్షి
నిజామాబాద్
గురువారం । 11 । సెప్టెంబర్ । 2025



ఇంజినీరింగ్ విద్యార్థులకు..
తెయూలో ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పిస్తామని వీసీ యాదగిరిరావు పేర్కొన్నారు.
- 8లో ▸



'వరద' సద్వినియోగం
శ్రీరాంసాగర్ నుంచి మిగులు జలాల విడుదలకు నిర్మించిన వరద కాలువ ప్రస్తుత సంవత్సరం సద్వినియోగమవుతోంది.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.9 /23.0

వాతావరణం
ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

సమర్థవంతంగా సేవలందించాలి
● అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్



నిజామాబాద్‌అర్బన్: ప్రకృతి విపత్తులు సంభవించిన సమయాల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టేలా సన్నద్ధమై ఉండాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ సూచించారు. మాస్టర్ ట్రైనర్లుగా శిక్షణ పూర్తిచేసుకున్న ఐదుగురు ఆపద మిత్ర వాలంటీర్లు బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా వాలంటీర్లు ఎస్ సురేఖ, జె జమున, బి రాజు, టి వెంకటేష్, జి సునీల్‌ను ఆయన అభినందిస్తూ మాస్టర్ ట్రైనర్ సర్టిఫికెట్లను అందజేశారు. మూడు వారాలపాటు బెంగళూరులో అందించిన శిక్షణలో నేర్చుకున్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. మాస్టర్ ట్రైనింగ్ పూర్తి చేసుకున్న వాలంటీర్లు మిగతా వాలంటీర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను గుర్తుంచుకొని విపత్తులు వాటిల్లిన సమయాల్లో సుశిక్షితులైన సైనికుల మాదిరి సమర్థవంతంగా సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ డీ–సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో తనిఖీ



నిజామాబాద్‌నాగారం: ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కొనసాగుతున్న వివిధ వైద్య విభాగాలను జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి బి రాజశ్రీ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జీజీహెచ్‌లో కొనసాగుతున్న క్షయ నియంత్రణ, రాష్ట్రీయ బాల స్వాస్థ, న్యూట్రిషన్ రిహాబిలిటేషన్, ఎస్ఎన్‌సీయూ విభాగాలను సందర్శించి సిబ్బంది పనితీరు, హాజరు పట్టికలు, వివిధ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ సమయపాలన పాటిస్తూ విధులు నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

1563 పోలింగ్ స్టేషన్లు
● ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల తుది ఓటరు జాబితా విడుదల



నిజామాబాద్ రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల తుది ఓటరు జాబితాను జెడ్పీ సీఈవో సాయాగౌడ్ బుధవారం విడుదల చేశారు. జిల్లాలో 307 ఎంపీటీసీ, 31 జడ్పీటీసీ స్థానాలు ఉండగా 1,563 పోలింగ్ స్టేషన్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 8,51,417 ఓటర్లు ఉండగా, పురుషులు 3,96,778 మంది, మహిళలు 4,54,621 మంది, ఇతరులు 18 మంది ఉన్నారని వెల్లడించారు. పూర్తిస్థాయి పోలింగ్ లిస్ట్, ఓటర్ల జాబితా ఆయా ఎంపీడీవో కార్యాలయాల్లో అందుబాటులో ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో సాయన్న, సిబ్బంది ఉన్నారు.

ఉగ్రమూలాలు జిల్లా వాసులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఐసిస్, లష్కరేతోయిబా సంస్థలతో సంబంధాలున్న వారు ఎన్ఐఏ అధికారులకు నిజామాబాద్‌లోనే పట్టుబడుతుండడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. జిల్లాను కేంద్రంగా చేసుకొని హత్యలు, మతకలహాల సృష్టిపై యువకులకు శిక్షణ ఇస్తున్న పీఎఫ్ఐ సభ్యుడిని గతంలో ఎన్ఐఏ అరెస్టు చేసి విచారించగా దేశవ్యాప్తంగా సుమారు 170 మంది ఉగ్ర సంస్థ సభ్యులు పట్టుబడిన విషయం తెలిసిందే. తాజాగా బుధవారం బోధన్‌లో మరో వ్యక్తిని ఎన్ఐఏ అరెస్టు చేయడం ప్రజల్లో చర్చకు దారితీసింది.



మళ్లీ ఉగ్ర కలకలం

● బోధన్‌లో హాజీయమన్‌ను అదుపులోకి తీసుకున్న ఢిల్లీ ఎన్ఐఏ బృందం
● ఉలిక్కిపడ్డ జిల్లా ప్రజానీకం
● గతంలో బంగ్లాదేశీయులకు అక్రమంగా పాస్‌పోర్టులు జారీ చేసిన వైనం
● 2022లో జిల్లా కేంద్రంలో ఉగ్రసంస్థ పీఎఫ్ఐ శిక్షణ శిబిరాన్ని కనుగొన్న ఎన్ఐఏ, పోలీసులు
● నిజామాబాద్‌లో తీగ లాగితే దేశవ్యాప్తంగా కదిలిన డొంక
● అనంతరం పీఎఫ్ఐపై నిషేధం విధించిన కేంద్ర ప్రభుత్వం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జిల్లాలో మరోసారి ఉగ్ర మూలాలు కలకలం సృష్టించగా ప్రజలు ఉలిక్కిపడుతున్నారు. తాజాగా బుధవారం బోధన్ పట్టణానికి చెందిన హాజీయమన్‌ను ఢిల్లీ నుంచి వచ్చిన ఎన్ఐఏ పోలీసులు అరెస్టు చేసి విచారణ నిమిత్తం ఢిల్లీకి తీసుకెళ్లారు. ఐసిస్ ఉగ్రసంస్థతో సంబంధం ఉన్న వ్యక్తులను జార్ఖండ్ రాజధాని రాంచీలో ఎన్ఐఏ అరెస్టు చేసి విచారణ చేసిన సమయంలో బోధన్‌కు చెందిన హాజీయమన్ పేరు బయటకు వచ్చింది. హాజీయమన్ గత కొంతకాలంగా అంతర్జాతీయ ఫోన్‌కాల్స్ ఎక్కువగా మాట్లాడుతుండడాన్ని ఎన్ఐఏ గుర్తించింది. ఇతని ఇంట్లో ఎయిర్‌గన్‌ను ఎన్ఐఏ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బోధన్ కోర్టులో హాజరుపరిచి, విచారణ నిమిత్తం హాజీయమన్‌ను ఢిల్లీకి తీసుకెళ్లారు. ఐసిస్‌తో సైతం లింకులు ఉన్నట్లు ఎన్ఐఏ అధికారులు భావిస్తున్నారు.

■ బోధన్ పట్టణంలో నకిలీ చిరునామాలతో 2018లో బంగ్లాదేశీయులకు అక్రమ పద్ధతిలో 74 పాస్‌పోర్టులు జారీ చేశారు. ఈ విషయమై అప్పటి స్పెషల్ బ్రాంచ్ ఏఎస్ఐలు మల్లేష్, అనిల్‌లపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. బంగ్లాదేశ్ నుంచి కోల్‌కతాకు తరువాత బోధన్‌కు వచ్చిన వ్యక్తులకు అక్రమంగా పాస్‌పోర్టులు జారీ చేసే విషయంలో ఈ ఇద్దరు ఏఎస్ఐలు కీలక పాత్ర పోషించడం గమనార్హం. బోధన్‌లోని ఒకే ఇంటి నంబర్ మీద 24 పాస్‌పోర్టులు ఇవ్వడం అప్పట్లో సంచలనం కలిగించింది. అలాగే ఇతర అద్దె ఇంటి నంబర్లపై సైతం ధ్రువీకరణలు సృష్టించి పాస్‌పోర్టులు జారీ చేయించారు. తరువాత కాలంలో బోధన్‌లో రోహింగ్యాలకు ఆధార్ కార్డులు సైతం జారీ చేయడం గమనార్హం.

శిక్షకుడు అబ్దుల్ ఖాదర్ అరెస్ట్‌తో..
నిజామాబాద్ ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆటోనగర్‌లో 2022 జూలై 4న పీఎఫ్ఐ సభ్యుడు, శిక్షకుడు అబ్దుల్ ఖాదర్ అరెస్ట్‌తో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. అబ్దుల్ ఖాదర్ డైరీ, వివిధ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. అబ్దుల్ ఖాదర్ అరెస్ట్ తర్వాత నిజామాబాద్ రూరల్ మండలం గుండారంలో ముగ్గురు పీఎఫ్ఐ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సమావేశం సమాచారంతో పోలీసులు పీఎఫ్ఐ జిల్లా కన్వీనర్ షేక్ షాదుల్లాను, నగరానికి చెందిన మహ్మద్ ఇమ్రాన్, మహమ్మద్ అబ్దుల్లాను అదుపులోకి తీసుకుని విచారించారు. శిక్షకుడు అబ్దుల్ ఖాదర్ వద్ద దొరికిన డైరీలోని వివరాలతో విచారణ చేపట్టారు. జిల్లాలో 200 మందికి పైగా శిక్షణ తీసుకోగా, ఇందులో 23 మంది కీలక సభ్యులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. తెలంగాణలో నిజామాబాద్, ఆంధ్రప్రదేశ్‌లో కడప బేస్ క్యాంపుగా ఏర్పాటు చేసుకుని పీఎఫ్ఐ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలింది. విచారణలో పీఎఫ్ఐ ఒక వర్గానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నట్లు గుర్తించిన పోలీసులు ఎన్ఐఏకు లేఖ రాశారు. ఎన్ఐఏకు చెందిన ఉన్నత స్థాయి అధికారి జిల్లా పోలీసులతో సమావేశమయ్యారు. కేసులో తీవ్రతను గుర్తించిన ఎన్ఐఏ 2022 ఆగస్టు 26న పీఎఫ్ఐ కేసును తీసుకుంది. ఎన్ఐఏ అధికారులు నలుగురిని విచారించిన తరువాత సెప్టెంబర్ 18న నిజామాబాద్‌తోపాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో పలుచోట్ల సోదాలు నిర్వహించారు. సోదాల్లో ల్యాప్‌ట్యాప్‌లు, ఎలక్ట్రిక్ వస్తువులు, సెల్‌ఫోన్లులు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివరాలు లభించాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో నలుగురిని అరెస్ట్ చేసి నాంపల్లి కోర్టుకు హాజరుపర్చారు. వారిచ్చిన సమాచారంతో పాటు ఎన్ఐఏ సేకరించిన సమాచారం మేరకు దేశవ్యాప్తంగా సోదాలు నిర్వహించారు. 170 మందిని అరెస్ట్ చేయడంతో పాటు విదేశాల నుంచి రూ.120 కోట్లు సేకరించినట్లు ఎన్ఐఏ అధికారులు గుర్తించారు. సిమి నుంచి పీఎఫ్ఐగా మారిన ఈ సంస్థకు ఐసిస్, లష్కరేతోయిబా సంస్థలతోనూ సంబంధాలు ఉన్నట్లు తేలింది.

బేస్ క్యాంపుగా గుర్తించిన ఎన్ఐఏ..
నిషేధిత సిమి (స్టూడెంట్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా) నుంచి పీఎఫ్ఐ (పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా)గా రూపాంతరం చెందిన ఉగ్ర సంస్థ శిక్షణ కేంద్రాన్ని 2022లో నిజామాబాద్‌లో కనుగొన్నారు. ఈ శిక్షణ కేంద్రంలో వివిధ రకాలుగా హత్యలు ఎలా చేయడం, మతకలహాలు సృష్టించే విషయాలపై శిక్షణ ఇచ్చారు. దక్షిణాదిలో కీలకమైన బేస్‌క్యాంప్‌గా నిజామాబాద్ ఉన్నట్లు ఎన్ఐఏ గుర్తించింది. 2022 జూలై 4న నిజామాబాద్‌లో పీఎఫ్ఐ శిక్షకుడు అబ్దుల్ ఖాదర్ అరెస్టుతో దేశవ్యాప్తంగా డొంక కదిలింది. తరువాత జూలై 6న మరో ముగ్గురిని నిజామాబాద్‌లో అరెస్టు చేశారు. సెప్టెంబర్ 18న మరో ఇద్దరిని అరెస్టు చేశారు. మొత్తం 23 మందిపై జిల్లాలో కేసులు నమోదు చేశారు. ఆర్మూర్‌కు చెందిన నవీద్ అనే వ్యక్తిని సైతం ఎన్ఐఏ విచారించింది. అదేక్రమంలో దేశవ్యాప్తంగా 106 చోట్ల వివిధ రాష్ట్రాల్లో సోదాలు చేసిన ఎన్ఐఏ మొత్తం 170 మందిని అరెస్టు చేసింది. పీఎఫ్ఐ, అనుబంధ సంస్థలన్నింటిపైన కేంద్రం యూఏపీఏ చట్టం కింద నిషేధం విధించింది.

ఐలమ్మ స్ఫూర్తి
అందరికీ ఆదర్శం
● కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ అంకిత్

నిజామాబాద్‌అర్బన్: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శమని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఐలమ్మ వర్ధంతిని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. వినాయక్‌నగర్‌లోని ఐలమ్మ విగ్రహానికి కలెక్టర్, అదనపు కలెక్టర్ అంకిత్, ఇతర అధికారులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెత్తందారి వ్యవస్థకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ స్ఫూర్తిదాయకమైన పోరాటం చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నర్సయ్య, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మరోసారి ఇంటర్ అడ్మిషన్ లాగిన్
● మార్పులకు రెండ్రోజులు అవకాశం

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, ఇతర అన్ని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ అడ్మిషన్ల లాగిన్ ఓపెన్ చేస్తున్నట్లు డీఐఈవో రవికుమార్ తెలిపారు. ఈ నెల 11, 12 తేదీలలో అడ్మిషన్ లాగిన్ మార్పులు, ఇతర పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రైవేటు కళాశాలలో నామినల్ రోల్ కరెక్షన్ కోసం ప్రతి విద్యార్థికి రూ.200 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని, ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు ఎలాంటి రుసుము ఉండదని తెలిపారు. మరోసారి అడ్మిషన్ లాగిన్ ఉండదని, ప్రక్రియ పూర్తి చేసుకోవాలన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, పక్కన అదనపు కలెక్టర్ అంకిత్, ట్రైనీ కలెక్టర్

● కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరిగేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడారు. వివిధ కారణాలతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ముందుకురాని వారి స్థానంలో అర్హులైన కొత్త లబ్ధిదారులకు ఇళ్లను మంజూరు చేశామని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ఇందిరమ్మ కమిటీల ద్వారా కొత్త లబ్ధిదారులకు తెలియజేస్తూ, అందరూ మార్కింగ్ చేసుకొని నిర్మాణాలు ప్రారంభించేలా ప్రోత్సహించాలన్నారు. లబ్ధిదారులకు సెర్ప్, మెప్మా ద్వారా రుణాలు మంజూరయ్యేలా చొరవ చూపాలన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు ప్రక్రియను సైతం వేగవంతం చేయాలని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా లబ్ధిదారులను గుర్తించి జాబితాలు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. పంట పొలాల్లో ఉన్న ఇసుక మేటలను ఉపాధి హామీ కూలీలతో తొలగింపజేయాలన్నారు. పనుల జాతరలో భాగంగా మెటీరియల్ కాంపోనెంట్ కింద మంజూరైన మేజిక్ సోక్‌పిట్లు, పశువుల కొట్టాలు, వర్మీ కంపోస్ట్ తదితర నిర్మాణ పనులను వెంటనే చేపట్టి, సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై సౌర విద్యుత్ పలకాలను ఏర్పాటు చేసేందుకు వీలుగా మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమగ్ర వివరాలతో నివేదికలు అందించాలన్నారు. వీసీలో అదనపు కలెక్టర్ అంకిత్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, డీఆర్డీవో సాయాగౌడ్, హౌసింగ్ పీడీ పవన్ కుమార్, ఈఈ నివర్తి, డీపీవో శ్రీనివాస్, డీఏవో గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు

● పదోన్నతులతో కేటాయింపుల గందరగోళం
● ప్రమోషన్లు తిరస్కరించిన 46 మంది టీచర్లు
● 136 మందికి మరోసారి కేటాయింపులు
● నేటి నుంచి ముగ్గురు ఎంఈవోలతో పరిశీలన



నిజామాబాద్‌అర్బన్: జిల్లా విద్యాశాఖలో నేటి నుంచి మరోసారి సర్దుబాటు ప్రక్రియ నిర్వహించనున్నారు. గతంలో చేపట్టిన ఉపాధ్యాయుల సర్దుబాటు, ఇటీవల చేపట్టిన పదోన్నతులతో కేటాయింపుల్లో గందరగోళం ఏర్పడింది. దీంతో సర్దుబాటు ప్రక్రియ మళ్లీ మొదటికి వచ్చింది.

182 మందికి పదోన్నతులు..
వారం రోజుల క్రితం విభాగాల వారీగా మొత్తం 182 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించాయి. వీరిని సీనియారిటీ ప్రకారం పాఠశాలలకు కేటాయించారు. ఐతే, అంతకుముందే జిల్లాలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా 252 మంది టీచర్లను సర్దుబాటు చేశారు. రెండు ప్రక్రియలతో కేటాయింపుల్లో గందరగోళం ఏర్పడింది. పదోన్నతి పొందిన వారు, సర్దుబాటులోని ఉపాధ్యాయులు ఒకే పాఠశాలలకు కేటాయించబడ్డారు. దీంతో సర్దుబాటులో భాగంగా వెళ్లిన టీచర్లను విద్యాశాఖ మళ్లీ వెనక్కి పిలిపించి ఇతర ప్రాంతాలకు సర్దుబాటు చేసే ప్రక్రియ మొదలుపెట్టింది. పదోన్నతి పొందిన వారు వారికి కేటాయించిన పాఠశాలల్లోనే ఉండేలా ఆదేశాలు జారీ చేశారు. కాగా, 46 మంది టీచర్లు పదోన్నతులను తిరస్కరించారు. దీంతో వీరిని పక్కనపెట్టి 136 టీచర్లకు సర్దుబాటు ప్రక్రియ చేపట్టనున్నారు.

ఐతే, పదోన్నతులు తిరస్కరించిన టీచర్ల స్థానంలో అంతకుముందే సర్దుబాటులో వెళ్లిన టీచర్లు విధులు నిర్వర్తించనున్నారు. కాగా, మరోసారి సర్దుబాటు ప్రక్రియ నిర్వహించేందుకు నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ ఎంఈవోలతో కమిటీని ఏర్పాటు చేశారు. వీరు నేటి నుంచి సర్దుబాటు ప్రక్రియ చేపట్టనున్నారు.

“ అవసరమైన పాఠశాలలకు..



పదోన్నతి పొందిన టీచర్లకు పాఠశాలలు కేటాయించాం. అప్పటికే సర్దుబాటు ద్వారా అక్కడ ఉన్న టీచర్లను వెనక్కి పిలిపించి మళ్లీ అవసరమైన పాఠశాలలకు కేటాయిస్తాం. పదోన్నతి వదులుకున్న టీచర్లను వారి సర్వీస్ బుక్కుల్లో నాట్ విల్లింగ్ నమోదు చేస్తాం.

– అశోక్, డీఈవో

అడ్డూఅదుపూ లేని స్కానింగ్ దందా

● బోర్డుపై ఓ రేటు.. వసూలు చేసేది మరో రేటు
● ఎక్స్‌రే, సీటీస్కాన్, ఎమ్మారైలకీ రిఫరల్
● టెక్నీషియన్లుగా జూనియర్ల చెలామణి
● అంతంత మాత్రంగానే తనిఖీలు



నిజామాబాద్‌నాగారం: జిల్లాలో స్కానింగ్ సెంటర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రజలను దోచుకుంటున్నాయి. ధరల నియంత్రణ లేకపోవడంతో ఒక్కో సెంటర్లో ఒక్కో రకంగా దోపిడీ కొనసాగుతోంది. రోగుల అత్యవసరాన్ని ఆసరాగా చేసుకుంటూ డబ్బులు వసూలు చేస్తున్నాయి. రిఫరల్ డాక్టర్లకు కమీషన్లు ముట్టజెబుతూ అందినంత దోచేస్తున్నారు. అర్హతలేని వారితో సెంటర్లను నిర్వహిస్తూ లక్షల్లో సంపాదిస్తున్నారు.

కన్నెత్తి చూడని అధికారులు..
గర్భిణులతోపాటు కడుపునకు సంబంధించి ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా స్కానింగ్ చేయించాల్సిందే. చెస్ట్, గ్యాస్ట్రో, లివర్ తదితర సమస్యలు తెలుసుకునేందుకూ సంబంధిత వైద్యులు స్కానింగ్‌కు రిఫర్ చేస్తున్నారు. అందులో వచ్చే రిపోర్టు ఆధారంగానే వైద్యులు చికిత్స చేస్తారు. గాయాలు, తలనొప్పి, చెస్ట్, నరాల సమస్య ఎదుర్కొనే రోగులకు ఆర్థో వైద్యులు ఎక్కువగా ఎక్స్ రే, సీటీ స్కాన్, ఎమ్ఆర్ఐలను రాస్తుంటారు.

■ ఎక్స్ రే కోసం రూ.500 నుంచి రూ.1200, స్కానింగ్‌కు రూ.800 నుంచి రూ.2000 వరకు రోగుల నుంచి నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. ఇక సీటీస్కాన్, ఎమ్ఆర్ఐల విషయానికొస్తే ఫీజులు వేలల్లో ఉంటున్నాయి. జిల్లా వ్యాప్తంగా 137 స్కానింగ్ సెంటర్లు, 29 ఎక్స్‌రే, 16 సీటీ స్కాన్, 4 ఎమ్ఆర్ఐలు ఉన్నాయి. పలు సెంటర్లలో ధరల నియంత్రణ పాటించడం లేదు. పేరుకు మాత్రమే ధరల బోర్డు ప్రదర్శిస్తూ ఇష్టారీతిన వసూలు చేస్తున్నారని రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు చేయాల్సిన వైద్యారోగ్యశాఖ అటువైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వస్తున్నాయి.

జూనియర్లతోనే నిర్వహణ..
ఎక్స్‌రే, స్కానింగ్, సీటీస్కాన్, ఎమ్ఆర్ఐ ఏదీ తీయాలన్నా అనుభవం ఉన్న టెక్నీషియన్ ఉండాలి. డీఎంఐటీ (డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీ) కోర్సు చేసి, శిక్షణ తీసుకోవాల్సి ఉంటుంది. అయితే మల్టీ, సూపర్ స్పెషాలిటీ, పెద్ద పెద్ద ప్రైవేట్ ఆస్పత్రుల్లో టెక్నీషియన్లకు రూ. 35 వేల నుంచి రూ. 50 వేల వరకు వేతనాలు ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో జూనియర్లకు రూ.20 వేల లోపు జీతాలు ఇచ్చి నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్నారు. జూనియర్లు ఇచ్చే స్కానింగ్ రిపోర్టుల్లో తేడా వస్తే ఎవరు బాధ్యత వహిస్తారనేది ప్రశ్నార్థకంగా మిగులుతోంది.

అంతా రిఫరల్
జిల్లాలో సీనియర్ వైద్యులు సొంతగా ఆస్పత్రులు నడుపుతూ అవసరం ఉంటేనే ఎక్స్‌రే, స్కానింగ్, సీటీస్కాన్, ఎమ్ఆర్ఐ చేయించుకోవాలని రోగులకు సలహా ఇస్తున్నారు. కానీ, మేనేజ్‌మెంట్ ఆస్పత్రుల్లోని వైద్యులు మాత్రం ప్రతి చిన్న సమస్యకు ఎక్స్‌రే, సీటీస్కాన్, స్కానింగ్, ఎమ్ఆర్ఐలు రాస్తున్నారు. ఇలా రిఫరల్ దందా చేస్తూ కొంతమంది వైద్యులు కమీషన్లు తీసుకుంటున్నారని బహిరంగంగా చర్చించుకుంటున్నారు. రూ.1000 ఫీజుకు రూ.200 చొప్పున కమీషన్ తీసుకుంటున్నట్లు సమాచారం.

“ తనిఖీలు చేస్తున్నాం..
జిల్లాలోని అన్ని స్కానింగ్ సెంటర్లలో ఇప్పటికే తనిఖీలు చేశాం. పలుమార్లు హెచ్చరించాం. స్కానింగ్ విషయంలో తప్పుడు రిపోర్టులు ఇచ్చినట్లు మా దృష్టికి వస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. సెంటర్లలో మళ్లీ తనిఖీలు చేయిస్తాము. ప్రత్యేక బృందం సైతం తనిఖీలు చేస్తూనే ఉంది.

– రాజశ్రీ, జిల్లా వైద్యాధికారి

జలసిరులు

● భూగర్భ జలాలు పైపైకి..
● జిల్లాలో సరాసరి నీటిమట్టం 8.48 మీటర్లు
● భారీ వర్షాలతో తీరిన నీటి లోటు



డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో భూగర్భ జలాలు పెరిగాయి. ఆగస్టు నెలలో కురిసిన భారీ వర్షాలు భూగర్భ జలాల పెరుగుదలకు ఎంతో దోహదపడ్డాయి. లోటు పరిస్థితి నుంచి మేలైన స్థాయికి తీసుకొచ్చాయి. జూలై వరకు 11.76 మీటర్ల లోతులో ఉన్న జలాలు ఆగస్టు ముగిసే నాటికి సరాసరి 8.48 మీటర్లకు వచ్చాయి. అంటే ఒక్క నెలలోనే ఏకంగా 3 మీటర్ల వరకు పెరిగాయి. ఇది గతేడాది ఆగస్టు (8.66 మీటర్లు)తో పోలిస్తే మెరుగైన పరిస్థితి. వర్షాకాలంలో ఇప్పటి వరకు 78 సెంటీమీటర్ల వర్షపాతం నమోదవగా, ఇందులో సగం మేర ఆగస్టులోనే వర్షం కురిసింది. వరదలు పోటెత్తి భూగర్భంలో ఊట భారీగా చేరింది. మే నెల నుంచి ఆగస్టు నాటికి వచ్చే సరికి మొత్తంగా 4 మీటర్లు పెరిగాయి. వచ్చే ఏడాది వరకు బోరుబావులు, సాగునీటికి ఎలాంటి ఢోకా ఉండదని గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ అధికారి శ్రీనివాస్ బాబు పేర్కొన్నారు.

53 ఫిజోమీటర్లలో పుష్కలంగా జలం...
ఆగస్టు మాసానికి సంబంధించిన భూగర్భ జలాల లెక్కలను ఇటీవల గ్రౌండ్‌వాటర్ డిపార్ట్‌మెంట్ తీసింది. జిల్లా వ్యాప్తంగా 82 ఫిజోమీటర్ల ద్వారా నీటి లెక్కలను సేకరించింది. ఇందులో 53 ఫిజోమీటర్లలో 10 మీటర్ల లోపు నీటి మట్టాలున్నాయి. 25 ఫిజోమీటర్లలో 10–20 మీటర్ల లోపు, నాలుగు ఫిజో మీటర్లలో 20 మీటర్ల లోతులో జలాలున్నాయి. జిల్లా వ్యాప్తంగా 65–85 శాతం వరకు భూగర్భ జలాలు పుష్కలంగా విస్తరించి ఉన్నాయి. ఇది వరకు కురిసిన వర్షాలతోపాటు ముమ్ముందు కూడా పడే అవకాశం ఉండడంతో మరికొంత మేర భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంది.

నెలల వారీగా భూగర్భ జలాలు (మీటర్లలో)

మే	12.48
జూన్	11.49
జూలై	11.76
ఆగస్టు	8.48

క్లుప్తంగా

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న ఇన్ ఫ్లో



బాల్కొండ: ఎస్సారెస్పీలోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద కొనసాగుతుండటంతో వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి రాత్రి పదిగంటల ప్రాంతంలో 95వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ నుంచి 23 వరద గేట్ల ద్వారా 74,976 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. వరద కాలువ ద్వారా 19 వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 5500, ఎస్కేప్ గేట్ల ద్వారా 2500, సరస్వతి కాలువ ద్వారా 800, లక్ష్మి కాలువ ద్వారా 200, గుత్ప లిఫ్ట్ ద్వారా 270, మిషన్ భగీరథ ద్వారా 231, ఆవిరి రూపంలో 684 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా బుధవారం రాత్రి ప్రాజెక్ట్‌లో అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్ట్ నిండుకుండలా ఉంది.

ఎస్సారెస్పీ సందర్శన

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌ను నిజామాబాద్ డివిజన్ క్వాలిటీ కంట్రోల్ ఈఈ కిమ్యానాయక్ బుధవారం సందర్శించారు. ప్రాజెక్ట్ ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లో వివరాలను, ప్రాజెక్ట్‌లో కొనసాగుతున్న పనుల వివరాలను ప్రాజెక్ట్ ఈఈ చక్రపాణిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాజెక్ట్ అధికారులు ఈఈని ఘనంగా సన్మానించారు. డిప్యూటీ ఈఈ గణేశ్, ఏఈఈ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎల్‌ఎల్‌బీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం 4వ సెమిస్టర్ రెగ్యులర్ థియరీ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగినట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం నిర్వహించిన పరీక్షలకు 28 మందికి 28 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. తెయూ పరిధిలో జరుగుతున్న ఎంఈడీ 1, 2, 3, 4 వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ థియరీ పరీక్షలకు 8 మందికి 8 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 29 మందికి 28 మంది విద్యార్థులకు హాజరు కాగా ఒకరు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు



మోపాల్: మండలంలోని కంజర్ శివారులో ఓ కారు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మోపాల్‌కు చెందిన మంగలి కృష్ణ దంపతులు వ్యక్తిగత పని నిమిత్తం కులాస్పూర్ వైపు నుంచి మోపాల్‌కు బుధవారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో వస్తున్నారు. కంజర్ గ్రామ కమాన్ దాటిన తర్వాత ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి అదుపు తప్పి పొలాల్లోకి దిగిపోయింది. ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. జేసీబీ సహాయంతో కారును తీశారు.

‘వరద’ సద్వినియోగం

- వరద కాలువ ద్వారా నీటి విడుదల
- నిండుతున్న చెరువులు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



వేల్పూర్ మండలం అంక్సాపూర్ వద్ద సంత మల్లన్న లిఫ్ట్‌కు వెళ్తున్న వరద



వరద కాలువ ద్వారా ప్రవహిస్తున్న నీరు

బాల్కొండ: ఎస్సారెస్పీ నుంచి మిగులు జలాలను సద్వినియోగం చేసుకునేందుకు నిర్మించిన వరద కాలువ ప్రస్తుత సంవత్సరం సద్వినియోగమవుతోంది. ఈ వరద కాలువ నిర్మాణం ప్రాజెక్ట్ మిగులు జలాలు గోదావరిలోకి వదలకుండా కాలువ ద్వారా వదిలి నల్గొండ జిల్లాలో 2.2 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించేందుకు చేపట్టారు. కానీ మారిన అనేక పరిణామాల్లో వరద కాలువ ఎస్సారెస్పీ పునరుజ్జీవనానికి రివర్స్ పంపింగ్ కోసం నీటి సరఫరా చేసే కాలువ అయింది. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద వచ్చి చేరుతుండటంతో 28 రోజుల నుంచి కాలువ ద్వారా నీటి విడుదలను చేపడుతున్నారు. వరద కాలువ ద్వారా విడుదలవుతున్న నీరు సద్వినియోగం అవుతోంది. బాల్కొండ నియోజక వర్గంలోని 16 చెరువులను నింపేందుకు 9 తూంలను ఏర్పాటు చేశారు. 9 చెరువుల తూం ల ద్వారా చెరువులకు నీటి సరఫరా జరుగుతోంది. నియోజక వర్గంలో 1529 ఎకరాలకు సాగునీరు అందుతోంది. వరద కాలువ ద్వారా నీటి విడుదల కొనసాగుతుండడంతో వరద కాలువ పరివాహక ప్రాంతంలోని భూగర్భ జలాలు సమృద్ధిగా పెరుగుతాయని రైతులు పేర్కొంటున్నారు.

మధ్యమానేరు నింపేందుకు..

ప్రాజెక్ట్ నుంచి వరద కాలువ ద్వారా నీటి విడుదలను చేపట్టి మధ్యమానేరు డ్యాం(ఎంఎండీ) నింపుతున్నారు. గత నెల రోజుల వ్యవధిలో 45 టీఎంసీల నీటిని వరద కాలువ ద్వారా వదిలారు. వరద కాలువ 122 కిలోమీటర్ల పొడవున ఉంది. కాలువ మొత్తం 35 తూంలు, 16 చెక్ డ్యాంలు ఉన్నాయి. ప్రస్తుతం అన్నింటికి నీటి సరఫరా జరిగేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మిగులు జలాలు వరద కాలువ ద్వారా విడుదలవుతున్నాయి. ఎస్సారెస్పీ నీటి వివరాలను తెలుసుకోవడానికి నీటి విడుదల ప్రారంభ సమయంలో ఎంఎండీ ఎస్ఈ సుమతి ప్రాజెక్ట్‌కు వచ్చారంటే నీటి ఆవశ్యకత ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు.

అధికారులకు సహకరించాలి

వరద కాలువ ద్వారా విడుదలవుతున్న ప్రతి నీటి చుక్కను సద్వినియోగం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కొన్ని చోట్ల నీటి అవసరం లేకపోవడంతో ప్రస్తుత తూంలను ఓపెన్ చేయలేదు. రైతులు అధికారులకు సహకరించాలి.

– గణేశ్, డిప్యూటీ ఈఈ, వరద కాలువ

ఇంజినీరింగ్ విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పిస్తాం



మాట్లాడుతున్న తెయూ వీసీ యాదగిరిరావు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పిస్తామని వైస్ చాన్స్‌లర్ టి.యాదగిరిరావు తెలిపారు. బుధవారం తెయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి అధ్యక్షతన నిర్వహించిన నూతన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పరిచయ కార్యక్రమంలో వీసీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వర్సిటీలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు 18 ఏళ్ల సుదీర్ఘ కల అని, ఈ ప్రాంతంలో బడుగు బలహీన వర్గాలకు ఇంజినీరింగ్ విద్యను అందించేందుకు తెయూలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు సీఎం అనుమతించారన్నారు. విద్యార్థులకు అధునాతన సాంకేతిక బోధనా పద్ధతులతో నాణ్యమైన విద్యను అందిస్తామన్నారు. కౌన్సిలింగ్ సమయంలో హాస్టల్ వసతి లేదని ప్రకటించామని, అయితే విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకుల వినతి మేరకు ఇంజినీరింగ్ విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ప్రవేశపరీక్షలో వచ్చిన ర్యాంకు ముఖ్యం కాదని, ఇంజినీరింగ్‌లో చేరిన తర్వాత ఏం నేర్చుకున్నాం.. ఎలా జీవితంలో స్థిరపడ్డారనేదే ముఖ్యమని అన్నారు. ఫస్ట్ బ్యాచ్ విద్యార్థులైన మీరు తర్వాత వచ్చే బ్యాచ్‌ల విద్యార్థులకు ఆదర్శంగా నిలువాలని పిలుపునిచ్చారు. తెయూలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు కృషి చేసిన టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, సహకరించిన రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డికి వీసీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు నందిని, అతిక్ సుల్తాన్ ఘోరి, భ్రమరాంబిక, నీలిమ, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ చరిత్ర మరువలేనిది



చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసిన డీసీపీ బస్వారెడ్డి

ఖలీల్‌వాడి: తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ చరిత్ర మరువలేనిదని డీసీపీ బస్వారెడ్డి అన్నారు. నగరంలోని నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో చాకలి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి డీసీపీ పూలమాల వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యసాహసాలు, ప్రజాస్వామిక పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ శంకర్, బషీర్, వనజ రాణి, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీశైలం, రిజర్వ్ సీఐలు శ్రీనివాస్, తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

చదువులో వెనుకబడ్డ వారిపై శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న డీఐఈవో రవికుమార్

నిజామాబాద్‌అర్బన్: చదువులో వెనుకబడ్డ విద్యార్థులపై అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవికుమార్ అన్నారు. నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం అధ్యాపకులు, బోధనేతర సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతి అధ్యాపకుడు విద్యార్థుల హాజరుపై ప్రత్యేక శ్రద్ధ వహించి, ఫేస్ రికగ్నేషన్ సిస్టం ద్వారా హాజరు తీసుకోవాలని ఆదేశించారు. స్లిప్‌టెస్ట్‌లు నిర్వహించి మార్కులను రిజిస్టర్లలో ఎంట్రీ చేయాలని సూచించారు. కళాశాలలో నెలకొన్న అదనపు అధ్యాపకుల కొరతను ఇంటర్ బోర్డు అధికారుల దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. సమావేశంలో బుద్ధిరాజ్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేఎఫ్‌సీలో ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు



తనిఖీలు చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు



జరిమానా విధిస్తున్న శానిటరీ సూపర్‌వైజర్

నిజామాబాద్ సిటీ/ నిజామాబాద్‌లీగల్: జిల్లా కేంద్రంలోని పలు హోటళ్లపై జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారులు దాడులు చేశారు. బుధవారం సాయంత్రం నగరంలోని వేణుమాల్‌లో నిర్వహిస్తున్న కేఎఫ్‌సీపై ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ సునీత బృందం తనిఖీలు చేపట్టారు. చికెన్, ఫాస్ట్‌ఫుడ్ తయారీలో ఉపయోగించే పదార్థాల శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపారు. మున్సిపల్ శానిటేషన్ అధికారులు సైతం తనిఖీలు చేశారు. కిచెన్ అపరిశుభ్రంగా ఉండటంతో రూ.10 వేల జరిమానా విధించారు. గత రెండు రోజుల క్రితం కేఎఫ్‌సీ చికెన్ ముక్కలు కుళ్లిపోయి ఉండటం, పాచి వాసన వస్తుండటంతో కస్టమర్లు యజమానిని నిలదీశారు. నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో వీడియో తీసి వైరల్ చేశారు. దీంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు కేఎఫ్‌సీపై తనిఖీలు నిర్వహించారు. అనారోగ్యకర ఆహార పదార్థాలు సరఫరాచేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సాజిద్ అలీ హెచ్చరించారు. తనిఖీల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు జి. నవీత, జి. విక్రమ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకుల సునీల్, సిబ్బంది ఉన్నారు.

వైద్య సిబ్బందికి హెపటైటిస్ టీకాలు



నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో హెపటైటిస్ బి టీకాల కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో రాజశ్రీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో మొదటి విడతలో హెపటైటిస్ బి వ్యాక్సిన్‌ను ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందికి ఇచ్చినట్లు పేర్కొన్నారు. వైద్య సిబ్బంది వారి విధుల్లో భాగంగా హెపటైటిస్ బి వ్యాధికి గురికాకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యగా ఈ టీకాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, డీసీహెచ్ శ్రీనివాస ప్రసాద్, ప్రోగ్రామ్ ఆఫీసర్ తుకారం రాథోడ్, డీఐవో అశోక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజన, డీటీసీ దేవి నాగేశ్వరి, డాక్టర్ రాజు, డాక్టర్ సుప్రియ, వివిధ విభాగాల అధిపతులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామస్తుల ఆధ్వర్యంలోనే సల్మా బేగం అంత్యక్రియలు

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని పాతరాజంపేటలో మంగళవారం మృతి చెందిన సల్మా బేగం అంత్యక్రియలు బుధవారం గ్రామస్తులు, దత్తత తీసుకున్న కుమార్తె కరిష్మా చేతుల మీదుగా నిర్వహించారు. సల్మాబేగం మృతి చెందగా హైదరాబాద్ నుంచి ఓ వ్యక్తి వచ్చి తానే సల్మాబేగం కుమారుడని తానే అంత్యక్రియలు చేస్తానని తెలుపగా అందుకు గ్రామస్తులు అంగీకరించలేదు. అయితే దత్తత తీసుకున్న కరిష్మా బేగంతో గ్రామస్తులు అంత్యక్రియలు నిర్వహించారు. ఇదిలా ఉండగా తానే కొడుకునని చెప్పుకొనే వ్యక్తి అంత్యక్రియల అనంతరం హైదరాబాద్ నుంచి వచ్చిన తన బంధువులతో కలిసి తిరిగి వెళ్లిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు.

టెక్నికల్ కోర్సుల్లో శిక్షణ

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ఐటీ హబ్‌లో టెక్నికల్ కోర్సులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ నాలెడ్జ్ ఇన్‌చార్జి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జావా, పైథాన్, వెబ్ డెవలప్‌మెంట్, బేస్, సుడో కోడ్ మొదలగు విభాగాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రీజనింగ్ సాఫ్ట్ స్కిల్స్‌పై కోచింగ్ ఇస్తామని, ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 15, 16వ తేదీలలో ఐటీ హబ్‌లో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఏదైనా డిగ్రీ లేదా బీటెక్ చదివిన వారు అర్హులని, రూ.599 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

రేపు ఉద్యోగ మేళా

నిజామాబాద్ నాగారం: జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం ఈ నెల 12న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి మధుసూదన్ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారతి ఆక్సా లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, సేల్స్ మేనేజర్ పోస్టుల కోసం ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. ఏదైనా డిగ్రీ చదివి ఉండాలని, ఎంపికైన అభ్యర్థులు నిజామాబాద్, ఆర్మూర్, బాన్సువాడ, కామారెడ్డిలో విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని తెలిపారు.
ఆసక్తి గలవారు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు తీసుకొని, ఈ నెల 12 ఉదయం 10.30 గంటలకు శివాజీనగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయానికి రావాలని సూచించారు. వివరాలకు 9959456793, 9948748428, 6305743423 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఫిట్‌నెస్ లేని వాహనాలు సీజ్

ఆర్మూర్‌టౌన్: నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న, ఫిట్‌నెస్ లేని వాహనాలను సీజ్ చేసినట్లు ఆర్మూర్ ఎంవీఐ రాహుల్‌కుమార్ బుధవారం తెలిపారు. ఆర్మూర్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఫిట్‌నెస్ లేని నాలుగు వాహనాలను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. వాహనదారులు తమ వాహన ధ్రువీకరణ పత్రాలను తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎంవీఐ ప్రణీత్ రెడ్డి, విక్రమ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో భారీ వర్షం



యోగేశ్వర కాలనీ వద్ద రహదారిపై నిలిచిన నీరు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలో బుధవారం భారీ వర్షం కురిసింది. గంటపాటు వర్షం దంచి కొట్టడంతో పట్టణంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. రోడ్లపై నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. యోగేశ్వర కాలనీలో రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో మున్సిపల్ సిబ్బంది తొలగింపు చర్యలు చేపట్టారు.

ఓ నాన్న నువ్వెక్కడున్నవే..

- రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి
- కుమారుడు దుబాయి నుంచి వస్తున్న రోజే ఘటన
- పద్మాజీవాడిలో విషాదం



బాలయ్య(ఫైల్)

సదాశివనగర్: నాన్న నేను మన ఊరికి వస్తున్న.. ఆ క్షేమంగా రా బిడ్డ నీకోసం మేమంతా ఎదురుచూస్తున్నాం అంటూ ఫోన్‌లో ప్రేమగా మాట్లాడిన ఆ తండ్రి ఇక లేడని తెలిసిన ఆ కుమారుడి హృదయం ఎంతో తల్లడిల్లిపోయింది. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేని ఓ కుమారుడు దుబాయికి వెళ్లి మొదటిసారిగా ఇంటికి వస్తుండడంతో ఆ కుటుంబం ఎంతో సంతోషంతో నిండిపోయింది. మరుసటి రోజు కుమారుడు ఇంటికి చేరుతాడనే కొన్ని గంటల వ్యవధిలోనే మృత్యువు గుర్తు తెలియని వాహన రూపంలో తండ్రిని కబళించింది. ఈ ఘటన సదాశివనగర్ మండలం కుప్రియల్ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పద్మాజీవాడి గ్రామానికి చెందిన మ్యాదరి బాలయ్య(53) ఆరేపల్లి శివారులోని ఓ ఆయిల్ కంపెనీలో పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి పని ముగించుకొని బైక్‌పై స్వగ్రామానికి వస్తుండగా దారి వెంట రోడ్డుపై నడుచుకుంటు వెళ్తున్న బోధన్ ప్రాంతానికి చెందిన సయ్యద్ బాసిద్‌ను ఢీకొన్నాడు. దీంతో వాహనం అదుపు తప్పి బాలయ్య రోడ్డు పై పడడంతో కామారెడ్డి నుంచి నిజామాబాద్ వైపునకు వస్తున్న గుర్తు తెలియని వాహనం అతనిపై నుంచి వెళ్లింది. ఈ ఘటనలో బాలయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ ఢీకొన్న ఘటనలో బాసిద్‌కు గాయాలు కావడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు. కాగా బాసిద్ మతిస్థిమితం కోల్పోయి కొంత కాలంగా రోడ్డుపై తిరుగుతున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా బుధవారం ఉదయం దుబాయి నుంచి స్వగ్రామానికి చేరిన కుమారుడు శివకుమార్ తండ్రి బాలయ్య మృతదేహాన్ని చూసి బోరున విలపించాడు. డాడీ ఫ్లైట్ ఎక్కుతున్న అంటే జాగ్రత్తగా రా బిడ్డ అన్నవు.. నువ్వెక్కడున్నవే నాన్న అంటూ ఆ కుమారుడు రోదన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పుష్పరాజ్ పేర్కొన్నారు.

క్రైం కార్నర్

గోడకూలి ఒకరి మృతి



జాగీర్‌సింగ్ (ఫైల్)

భిక్కనూరు: మండల కేంద్రంలో గోడకూలి ఒకరు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన జాగీర్‌సింగ్(37) రేకుల షెడ్డుల నిర్మాణంతో పాటు షటర్లను తయారు చేస్తూ కుటుంబంతో కలిసి జీవిస్తున్నాడు. గత నెలలో కురిసిన భారీ వర్షానికి జాగీర్‌సింగ్ ఇల్లు కూలిపోవడంతో పక్కనే ఉన్న బంధువుల ఇంట్లో ఉంటున్నారు. బుధవారం వేకువజామున కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్తుండగా వర్షానికి కూలిన ఇంటి గోడ జాగీర్‌సింగ్‌పై పడింది. విషయాన్ని గమనించిన స్థానికులు, కుటుంబీకులు వెంటనే కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతను మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతుడికి భార్య, నలుగురు కుమార్తెలు, అంధుడైన ఓ కుమారుడు ఉన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి మహిళ ..



సావిత్రి (ఫైల్)

రుద్రూర్: మండల కేంద్రంలోని పెద్ద చెరువులో ప్రమాదవశాత్తు గాండ్ల సావిత్రి అలియాస్ సాయమ్మ (52) అనే మహిళ పడి మృతి చెందినట్లు ఎస్సై సాయన్న బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సాయమ్మ మంగళవారం చెరువులో బట్టలు ఉతకడానికి వెళ్లి జారి పడిపోయిందని తెలిపారు. బుధవారం చెరువులో మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వాహనం పైనుంచి పడి యువకుడు..



ఖలీల్‌వాడి: నగరంలోని ఐడీపీ చౌరస్తా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు మూడో టౌన్ ఎస్సై హరిబాబు బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని ఖిల్లా రోడ్డుకు చెందిన మహేశ్(32) పని నిమిత్తం అశోక్ లీలాండ్ వెహికల్‌పై వస్తున్నాడు. డ్రైవర్ గాటే ఖండూ వాహనాన్ని అతివేగంగా నిర్లక్ష్యంగా నడపడంతో వాహనం వెనకాల కూర్చొని ఉన్న మహేశ్ వాహనం పైనుంచి కిందపడ్డాడు. ఈ ఘటనలో అతని తలకు తీవ్రగాయం కావడంతో స్థానికులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రెండు టన్నుల స్టీల్ చోరీ

నవీపేట: మండలంలోని యంచ శివారులో జరుగుతున్న జాతీయ రహదారి(బీబీ 161)విస్తరణ పనుల కోసం డంప్ చేసిన స్టీల్ నుంచి పీరాజీ అనే వ్యక్తి 2 టన్నులు దొంగిలించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. పనులు నిర్వహిస్తున్న అనూష ప్రాజెక్ట్స్ లిమిటెడ్ మేనేజర్ పార్థసారధి ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సేవ చేసేందుకు ఇష్టం లేక హత్య

బోధన్‌రూరల్: వృద్ధురాలికి సేవ చేసేందుకు ఇష్టం లేని కుటుంబీకులు హత్య చేసిన ఘటన సాలూర మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి బోధన్‌రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సాలూర మండల కేంద్రానికి చెందిన కట్టం నాగవ్వ(65) అనారోగ్యంతో బాధపడుతోంది. ఆమెకు భర్త, కుమారులు లేకపోవడంతో మరిది చిన్న గంగారాం వద్ద ఉంటోంది. ఆమెకు సేవలు చేసేందుకు ఇష్టం లేని గంగారాం, భార్య, కుమారుడు గొంతు నులిమి హత్య చేశారు. వృద్ధురాలి వద్ద ఉన్న డబ్బు, బంగారం కోసమే నిందితులు హత్య చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

నిజామాబాద్ రూరల్: ప్రేమ విఫలమై ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరిఫ్ బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. రూరల్ పీఎస్ పరిధిలోని చంద్రశేఖర్ కాలనీకి చెందిన సూరజ్‌రావు(22), అదే కాలనీకి చెందిన ఓ అమ్మాయి గత ఆరేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇటీవల ఆ అమ్మాయి వేరే యువకుడితో ప్రేమలో ఉందని తెలిసి తట్టుకోలేక మంగళవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

రైల్వే గేటును ఢీకొన్న టాటా ఏస్



నిజామాబాద్ రూరల్: మండలంలోని మాధవనగర్ రైల్వే గేటును బుధవారం టాటా ఏఏస్ వాహనం ఢీకొనడంతో మధ్యలో విరిగిపోయింది. ఉదయం 11:30 ప్రాంతంలో రైలు వస్తుందని గేట్‌మన్ గేటు వేస్తుండగా గేటు దాటి త్వరగా వెళ్లాలని నిజామాబాద్ నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న టాటా ఏస్ వాహనం గేటును ఢీకొన్నదని గేట్‌మన్ తెలిపారు. గేట్ మధ్యలో విరిగిపోవడంతో సిబ్బంది పునరుద్ధరణ పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం తాత్కాలిక గేటు వేసి రైలు వచ్చిన ప్రతిసారి ప్రయాణికులను సిబ్బంది ఆపుతున్నారు. మరమ్మతులు ఇంకా పూర్తికాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

భార్యపై హత్యాయత్నం కేసులో భర్తకు ఐదేళ్ల జైలు

నిజామాబాద్ లీగల్: భార్యను మానసికంగా వేధించి కత్తితో గాయపర్చిన భర్తకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్షను విధిస్తూ నిజామాబాద్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి సాయిసుధ బుధవారం తీర్పు వెల్లడించారు. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన తురేకార్ రాజమణికి, కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం సిర్పూర్‌కు చెందిన సోన్ కాంబ్లె యాదవ్‌తో 2018 లో వివాహమైంది. కాంబ్లె మద్యం తాగుతూ భార్య సంపాదనపై ఆధారపడేవాడు. ఆమె నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తుండేది. 27మే2021న ఆస్పత్రికి వెళ్లి తన వెంట రావాలని గొడవ చేశాడు. దీంతో ఆమె రాను అనడంతో తన వెంట తెచ్చుకున్న కత్తితో ఆమెపై దాడి చేశాడు. పోలీసులు కాంబ్లెపై కేసు నమోదు చేశారు. బుధవారం నిందితుడు నేరం చేసినట్లు రుజువు కావడంతో జడ్జి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానాను విధించారు. జరిమానా చెల్లించకుంటే అదనంగా నెల రోజుల జైలు శిక్ష అనుభవించాలని జడ్జి తీర్పులో పేర్కొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి మూడు రోజుల జైలు

డిచ్‌పల్లి: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఓ వ్యక్తికి జిల్లా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మూడు రోజుల జైలు శిక్షను విధించినట్లు డిచ్‌పల్లి ఎస్సై ఎండీ షరీఫ్ బుధవారం తెలిపారు. డిచ్‌పల్లి పీఎస్ పరిధిలో ఈ నెల 8న నాగ్‌పూర్ గేట్ వద్ద పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ధర్మారం(బి) గ్రామానికి చెందిన గుర్రాల నర్సయ్య డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చారు. వివరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ నర్సయ్యకు మూడు రోజుల జైలు శిక్షను విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఎస్సై సూచించారు.

భిక్కనూరులో మరొకరికి..

భిక్కనూరు: డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ ఒకరికి జడ్జి రెండు రోజుల జైలు శిక్షను విధించినట్లు భిక్కనూరు ఎస్సై ఆంజనేయులు బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మోటాట్‌పల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడగా అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. యువకుడు మద్యం సేవించినట్లు రుజువు కావడంతో జడ్జి రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బాల్కొండలో ఇద్దరికి..

బాల్కొండ: ముప్కాల్ పీఎస్ పరిధిలో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో నిర్మల్ జిల్లాకు చెందిన భీమారెడ్డి, మహారాష్ట్రకు చెందిన రాజుగణేశ్ పట్టుబడ్డారు. వీరిని బుధవారం ఆర్మూర్ కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి గట్టు గంగాధర్ రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై రజనీకాంత్ తెలిపారు.

అల్ప్రాజోలం పట్టివేత

ఖలీల్‌వాడి: నగరంలోని గోశాల రోడ్డులో అల్ప్రాజోలం తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ విలాస్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని కోజకాలనికి చెందిన అబ్దుల్ మాలిక్ దేవని అనే వ్యక్తి కల్లు తయారీలో వాడే అల్ప్రాజోలంను గోశాల రోడ్డు గుండా తీసుకెళ్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసినట్లు పేర్కొన్నారు. దాడిలో 609 గ్రాముల అల్ప్రాజోలం, స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ స్వప్న, సిబ్బంది రాజన్న, నారాయణరెడ్డి, హమీద్, శివ, శ్యాంసుందర్, కానిస్టేబుల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో స్కావెంజర్ మృతి

బాన్సువాడ: బాన్సువాడ ఉన్నత పాఠశాల (బాలుర)లో స్కావెంజర్‌గా పని చేస్తున్న గైనీ సునీత(32) బుధవారం గుండెపోటుతో మృతి చెందింది. తాడ్కోల్ శివారులోని డబుల్ బెడ్‌రూం కాలనీలో నివాసముంటున్న సునీత ప్రతీ రోజులాగే పాఠశాలకు వచ్చింది. గుండెలో నొప్పిగా ఉందని ఆస్పత్రికి వెళ్తానని హెచ్‌ఎం రాణికి చెప్పి ఆమె వద్ద రూ. వెయ్యి తీసుకుని పాఠశాల నుంచి బయలుదేరింది. పాఠశాల గేటు దాటగానే ఒక్కసారిగా కుప్పకూలింది. వెంటనే ఉపాధ్యాయులు గమనించి ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు.